ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రైతుల రుణమాఫీ, 25 లక్షల ఉద్యోగాలు

మహారాష్ట్ర ఎన్నికలు.. బీజేపీ మేనిఫెస్టో విడుదల 2లో..

సంపుటి: 2 | సంచిక: 214 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 11 నవంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# కురుమూర్తి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తా

## సీఎం రేవంత్ రెడ్డి



**పేదల దేవుడు కురుమూర్తి స్వామిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు.**

దేవరకద్ర, నవంబర్ 10(ప్రభాత ఉదయం) శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం శ్రీ కురుమూర్తి స్వామి దర్శనానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని, దేవస్థానం వద్ద ఎలివేటేడ్ కారిడార్ ఘాట్ రోడ్ కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి , జిల్లా ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి , యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఆలయ చైర్మన్, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్ లు, తదితర ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రులకు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... దేవ స్థానం వద్ద ఎలివేటేడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ మంజూరు చేసి, కలియుగ ప్రత్యక్ష దైవం ..మిగతా 2లో



## అడ్డగోలు హామీలు ఇచ్చి.. ఇప్పుడు అధికారులను బలిపశువులను చేస్తున్నారు

**హన్మకొండ జిల్లా బీఆర్ఏస్ పార్టీ కార్యాలయంలో కేటీఆర్**

హన్మకొండ, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): హన్మకొండ జిల్లా బీఆర్ఏస్ పార్టీ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో స్వాగతం పలికిన జిల్లా కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది సరిగ్గా ఇదే రోజు కామారెడ్డి సభలో బి సి డిక్లరేషన్ ప్రకటించి ఏడాది పూర్తయిందని, బీసీ డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయి ఒక్కటైనా హామీ చేసిందా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. చేతి గుర్తుకు ఓటు వేస్తే చేతి వృత్తుల వాళ్లకు గొంతు కోసిన పాలన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సాగుతోందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నో పథకాలు ఉండేది కులవృత్తులను బలోపేతం చేసేలాగా ఎన్నో పథకాలు తీసుకొచ్చావన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. బీసీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తుందని, రేవంత్ రెడ్డి రాగానే బీసీ బంద్ బంద్ అయింది రైతుబంధు బంద్ అయిందన్నారు కేటీఆర్. బీసీల ఓట్ల కోసం ఇప్పుడు కులగనన అని కొత్త నినాదం ఎత్తుకున్నారని, సర్వే కోసం ఇంటికి వెళ్తే అధికారులను జనం ..మిగతా 2లో

## యాదగిరిగుట్టకు పోటెత్తిన జనం.. దర్శనానికి 3 గంటల సమయం

**హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం భారీగా క్యూ లైన్ లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పడుతుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కార్తీక** ..మిగతా 2లో



## ప్రజా విజయోత్సవాలు కాదు.. ప్రజా వంచన ఉత్సవాలు చేసుకోండి

**కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ సెటైర్లు**



**హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): ఆరు గ్యారంటీలు అమలు చేశారని విజయోత్సవాలు చేసుకుంటున్నారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలనెలా రూ.2500 లు ఇచ్చారని విజయోత్సవాలు చేసుకుంటారా? వృద్ధులకు రూ.4 వేల ఆసరా పెన్షన్ ఇచ్చారని చేసుకుంటారా? పేదలకు ఇండ్లు** ..మిగతా 2లో



## నగరంలో కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదు

**కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): నగరంలో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లోని డి-క్లాస్‌లో కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన అనంతరం ఆసిఫ్‌నగర్ డివిజన్‌లోని దయాబాగ్‌లో G01 కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. గత అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో శాసన సభ్యులుగా, కార్పొరేటర్లుగా మజ్లిస్ పార్టీ నేతృత్వం వహిస్తుందన్నారు. మజ్లిసేతర ప్రాంతాల్లో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కూడా ప్రజలకు అందకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ..మిగతా 2లో

# కాంగ్రెస్ పార్టీ అధికారిక వెబ్‌సైట్‌లో అబద్ధాలు

## హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీ అధికారిక వెబ్‌సైట్‌లో అబద్ధాలు పెట్టారని మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. రుణమాఫీ చేస్తామని మాట తప్పారుని కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తన అబద్ధాల ప్రవాహాన్ని మహారాష్ట్ర లో కొనసాగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీ లు ఇచ్చి అమలు చేయకుండా తెలంగాణ లో మోసం చేశారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రుణమాఫీ చేస్తాం అని చెప్పి మాట తప్పినం అని మహారాష్ట్ర లో చెప్పాల్సి ఉండే అన్నారు. మహారాష్ట్ర కు వెళ్లి అన్ని గ్లోబల్స్ ప్రచారం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారిక వెబ్సైట్ లో అబద్ధాలు పెట్టారని మండిపడ్డారు. మహాలక్ష్మి, రైతు భరోసా, రైతు కూలీలకు డబ్బులు, వరిపంట కు బోనస్, అమలు చేయట్లేదు అని చెప్పాల్సి ఉండే అన్నారు. తెలంగాణ లో అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. మేము మహారాష్ట్ర లో పోటీ చేయట్లేదన్నారు. అక్కడికి వెళ్లి ప్రచారం చేయమన్నారు. అందుకే ఇక్కడి నుండే కాంగ్రెస్ మోసాలపై చెబుతున్నామని క్లారిటీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం కోసం తెలంగాణ డబ్బులు వాడుతున్నారని ఆరోపించారు. నిన్న జరిగిన మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ రైతు గర్జన కార్యక్రమం హరీష్ రావు తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మొద్దు నిద్ర పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరవాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రైతు బంధు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ళ కోసం రైతు దీక్ష చేస్తున్నాం.. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపేందుకే రైతు దీక్ష చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో చెప్పని ఎన్నో పథకాలు రైతుల కోసం కేసీఆర్ పెట్టారు.. రైతుల సీఎం కేసీఆర్ అని ఇతర రాష్ట్రాల్లోనూ అన్నారని హరీష్ రావు తెలిపారు. భూతుల సీఎంగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచారు.. ఆరు గ్యారెంటీలు అమలు చేసిన అని మహారాష్ట్రలో రేవంత్ చెపుతున్నారు.. అందరిని మోసం చేసి మహారాష్ట్రలో అబద్దాలు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.



**తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు**


## అనుకూల వాతావరణం

హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడిందని, అది దేశంలో ఎక్కడా లేనంత సులభతర వాణిజ్య విధానాల ద్వారా సాధ్యమైందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మలేషియా రాష్ట్రం కౌలాలంపూర్‌లో ఆదివారం జరిగిన తెలంగాణా దశాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం ద్వారా, మలేషియా పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసిన శ్రీధర్ బాబు, తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి తాము వారికి ఆహ్వానాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, మలేషియా-భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత ..మిగతా 2లో

# కురుమూర్తి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తా





మొదటి పేజీ తరువాయి...

శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దర్శనానికి విచ్చేసిన పాలమూరు ముద్దు బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కురుమూర్తి స్వామి వారి భక్తుల తరుపున ధన్యవాదాలు తెలియజేసారు. పేదల తిరుపతిగా ప్రసిద్ధ గాంచిన కురుమూర్తి స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు జాతర లో కళ్యాణ మండపం, వసతి గృహాలు, ఆలయ అభివృద్ధి కొరకు మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..కేసీఆర్‌ను పాలమూరు ప్రజలు పార్లమెంట్‌కు పంపింతే.. పదేళ్ళు సీఎంగా ఉన్న కేసీఆర్ మహబూబ్ నగర్ జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, పరిశ్రమలు రాలేదని.. దాంతో జిల్లాలో వలసలు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, అధికారంలో ఉన్నప్పుడు మీ నియోజకవర్గాలకు నిధులు తీసుకుపోయినప్పుడు మేం అడ్డుపడలేదు. ఇప్పుడు మాకు అవకాశం వచ్చింది. మా జిల్లా అభివృద్ధిని అడ్డుకోవద్దు, ఒకవేళ అడ్డుపడితే మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు మిమ్మల్ని క్షమించరన్నారు, నాపై కోపం ఉంటే వేరే రకంగా రాజకీయంగా కక్ష్య తీర్చుకోండని తెలియజేశారు. ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నామని. ప్రతినెలా జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. అపర భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు కొంతమంది దుర్మార్గులు కుట్రలు చేస్తున్నారు. వలసలు ఆపాలని నేను ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. జిల్లాలోని మన్యం కొండ, కురుమూర్తి దేవాలయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామన్నారు.



## నగరంలో కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదు

మొదటి పేజీ తరువాయి...

మండపడ్డారు. మజ్లిస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు పక్షపాతంతో వ్యవహరిస్తూ ఇక్కడి ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. పార్లమెంటు సభ్యుడిగా బాధ్యతగా నాంపల్లి నియోజకవర్గ ప్రజలకు మేలు చేసేలా అనేక పనులు చేస్తున్నామన్నారు. నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్ మెంట్ల సాయంతో సుమారు రూ. 78 లక్షలతో కమ్యూనిటీ హాళ్లు, ఓపెన్ జిమ్స్, బోర్ వెల్స్.. ఇలా అనేక సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. బస్తీ నాయకులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా ముందుకురావాలన్నారు. హైదరాబాద్ నగరంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్ మెంటుకు నిధుల కొరత వేధిస్తుందన్నారు. కనీసం వీధి లైట్లు హ్యాండిల్ చేసే సిబ్బందికి కూడా జీతాలివ్వడం లేదు. దీంతో సమ్మెకు దిగారన్నారు. హైదరాబాద్ నగరంలో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వని కారణంగా కొత్త టెండర్లు తీసుకునే పరిస్థితి లేదన్నారు. నగరంలో అంబర్ పేట్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, నాంపల్లి, గోషామహల్ వంటి ప్రాంతాల్లోని బస్తీల్లో నిధుల కొరతతో ప్రజలకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్ మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్లకు నిధుల కొరతతో అరకొర సౌకర్యాలతో పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు.



## రైతుల రుణమాఫీ, 25 లక్షల ఉద్యోగాలు

### మహారాష్ట్ర ఎన్నికలు.. బీజేపీ మేనిఫెస్టో విడుదల

మహారాష్ట్ర, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): మహారాష్ట్రలో అసెంబ్లీలో విజయం సాధించేందుకు మహాయుతి కూటమి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఎన్నికలకు కొద్ది సమయం ఉండడంతో కూటమి, ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేసింది. ముఖ్యంగా రైతుల రుణమాఫీ గురించి తొలిసారి ప్రస్తావించింది. ఇంకా మేనిఫెస్టోలోని కొన్ని అంశాలు మీకోసం.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం కొద్దిరోజులు మాత్రమే ఉంది. దీంతో అధికార బీజేపీ-మహాయుతి కూటమి తమ అస్త్రాలను బయటపెట్టింది. ఇందులోభాగంగా ఆదివారం కూటమి మేనిఫెస్టోని విడుదల చేశారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా. ముంబై బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రులు అమిత్ షా, పియూష్ గోయల్, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌లు కూటమి సంకల్ప్ పత్ర పేరుతో విడుదల చేశారు. మహారాష్ట్రలో అధికారం నిలబెట్టుకోవడానికి తొలిసారి రైతు రుణమాఫీ అస్త్రాన్ని తెరపైకి తెచ్చింది బీజేపీ కూటమి. అన్నదాతలకు రుణమాఫీని ప్రకటించింది. ఇప్పటివరకు ఉన్న లడ్కీ బహిన్ యోజన కిందట ఇస్తున్న మొత్తాన్ని రూ. 1500 నుంచి రూ. 2,100 పెంచుతున్నట్లు పేర్కొంది. 11 లక్షల మంది మహిళలకు ఇస్తున్న లక్షపతి దీదీ పథకాన్ని, 50 లక్షల మందికి విస్తరించనుంది. వృద్ధులకు ఇస్తున్న రూ.1500 నుంచి రూ.2,100 పెంచుతున్నట్లు వెల్లడించింది. రాబోయే ఐదేళ్లలో యువతకు 25 లక్షల ఉద్యోగాలు ఇస్తామని సంకల్ప్ పత్ర పేరులో పేర్కొంది బీజేపీ కూటమి. పరిశ్రమలను ప్రోత్సహించే క్రమంలో రూ. 25 లక్షల వరకు సున్నా వడ్డీ రుణం ఇస్తామని తెలిపింది. ఎరువులపై జీఎస్టీ తిరిగి రైతులకు ఇస్తామని వెల్లడించింది. ఎంఎస్పీ కంటే తక్కువ పంటలు కొనుగోలు చేసిన రైతులకు బవంతర్ యోజన ద్వారా పరిహారం అందిస్తామన్నారు. ఓవరాల్‌గా కీలకమైన అంశాలపై ప్రధానంగా ఫోకస్ చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో టెక్నాలజీ బలోపేతం కోసం విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తామన్నది మరో కీలకమైన పాయింట్. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీకి అసలైన పోటీ మహా వికాస్ అఘాడీతోనని పునరుద్ఘాటించారు. తమ మేనిఫెస్టో మహారాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయన్నారు. రైతులను గౌరవించడం, మహిళలకు ఆర్థికంగా పైకి తీసుకురావాలన్నదే తమ ధ్యేయమని నొక్కి వక్కాణించారు. ఉద్ధవ్ థాక్రేని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. వీర్ సావర్కర్ గురించి సానుకూలంగా మాట్లాడేలా రాహుల్ గాంధీని ఒప్పిస్తారా? బాలాసాహెబ్ థాక్రే గురించి కాంగ్రెస్ నాయకుడ్ని మెచ్చుకునే చెబుతారా అంటూ హిస్టరీని తెరపైకి తెచ్చే ప్రయత్నం చేశారాయన. నవంబర్ 6న మహారాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది కాంగ్రెస్. ఇరు పార్టీల మధ్య మేనిఫెస్టో విడుదల కావడంతో రెండు కూటముల మధ్య మాటల యుద్ధం పెరిగే అవకాశముంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 20న జరగనున్నాయి. మొత్తం 288 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు నవంబర్ 23న జరగనుంది.

### తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు

## అనుకూల వాతావరణం

మొదటి పేజీ తరువాయి...

బలపడాలని, రెండు దేశాల సంస్కృతుల్లో అనేక సారూప్యతలు ఉన్నందున పరస్పర సహకారం సులభంగా జరగవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. మలేషియా పారిశ్రామిక వేత్తలకు డిసెంబరులో తెలంగాణ సందర్శన కోసం ఏర్పాట్లు చేస్తున్నామని కూడా ఆయన పేర్కొన్నారు. అలాగే, తన రాజకీయ ప్రస్థానం 25 సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంలో, తనను ఆదరించిన మిత్రులు, సహచరులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన శ్రీధర్ బాబు, ఈ సందర్భంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే వంటి నేతల ద్వారా ఎన్నో ప్రోత్సాహాలు, ప్రాధాన్యతలు పొందిందని చెప్పారు. మంత్రిగా పనిచేసిన నలుగురు ముఖ్యమంత్రుల నుంచి కూడా అనేక ప్రోత్సాహాలు, ఆదరాభిమానాలు పొందినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సాట్ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అడ్డగోలు హామీలు ఇచ్చి.. ఇప్పుడు అధికారులను బలిపశువులను చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి...

నిలదీస్తున్నారన్నారు కేటీఆర్. అంతేకాకుండా%ా%'బీసీలకు సబ్ ప్లాన్ అని చెప్పావ్ ఒకటన్న అమలు అయ్యాయా. కుల గణన కోసం కావాలంటే ఆ ప్రశ్నలను తగ్గించండి. కేవలం కులాలకు సంబంధించిన సమాచారం మాత్రమే తీసుకోండి. ఆర్థిక అంశాలను ఆ ఫార్ములా నుంచి తొలగించండి. కులగర్ల కోసం చేస్తే కులాలకు సంబంధించిన వివరాలు సేకరించేలాగా ఫామ్ రూపొందించండి. కుల గణన చేసిన 42% రిజర్వేషన్లు అమలు అయ్యేలాగా చేయండి. మా ఎమ్మెల్యేల మీద దాడులు చేయడం కాదు ఇచ్చిన మాటను మీద నిలబెట్టుకో. ఇదే వరంగల్లో రైతుల డిక్లరేషన్ ప్రకటించారు. ఏ మార్కెట్ పోదాం రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. రాష్ట్రంలో రైతులకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నట్లు మహారాష్ట్రలో ఈ ముఖ్యమంత్రి బోగస్ మాటలు చెబుతున్నాడు. రైతులకు బోనస్ ఎక్కడ ఇచ్చావు ఒక్కచోటన్న ఇచ్చావా చూపిస్తావా ఏ మార్కెట్ పోదాం. నువ్వు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకు నిలదీస్తూనే ఉంటాం నిన్ను వెంటాడుతూనే ఉంటాం. కేసులు పెట్టుకున్న పాసులు పెట్టుకున్న భయపడేది లేదు. కులగణనాలో అధికారులను నిలదీయండి.. అడగండి%ా% దీని వివరాలు దేనికి ఎందుకు అని అడగండి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడగండి.. 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతనే ఈ వివరాలు తీసుకోండని జనం నిలదీయండి.. నిలదీయండి వివరాలు రాయించుకోండి. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు మీరు అమలు చేస్తారని కుల గణన కోసం వస్తున్న అధికారులను రాసి ఇవ్వమని అడగండి నిలదీయండి. బాంబుల శాఖ మంత్రి గురించి మీరు అడుగుతున్నాయి.. ఆయనకు బాంబుల శాఖ అని పేరు పెట్టండి.. వాళ్లని మాత్రం వదిలిపెట్టడం కచ్చితంగా నిలదీస్తాం.. విజయోత్సవాలు చేయాలా వారవోత్సవాలు చేయాలనేది మేము నిర్ణయిస్తాం.. డిసెంబర్ 9 కి ఏడాది పూర్తయిన నేపథ్యంలో వాళ్లు ఎలా వైఫల్యం చెందారో మేము కూడా అన్ని వివరాలు సేకరించి వైఫల్య వారోత్సవాలను నిర్వహిస్తాం..' అని కేటీఆర్ అన్నారు.



## యాదగిరిగుట్టకు పోటెత్తిన జనం.. దర్శనానికి 3 గంటల సమయం

మొదటి పేజీ తరువాయి...

మాసం సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించుకుంటున్నారు. కార్తీక మాసం, దానికి తోడు ఆదివారం సెలవుదినం కావడంతో ఇష్టదైవాలయ దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో క్షేత్రాలకు చేరుకుంటున్నారు. పార్కింగ్ స్థలం వాహనాలతో నిండిపోయి, మైదానం చుట్టూ ఉన్న రింగ్ రోడ్డుపై కూడా వాహనాలు నిలిచిపోయాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సత్యదేవుని వ్రతం, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధనలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపైనున్న గర్భగుడి వద్ద పంచనారసింహుని సమేతంగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ప్రధాన ఆలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద వెండశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, అన్నదాన సత్రం, కళ్యాణ కట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయానికి ఉత్తర దిశలో చిత్రపటాలు చేసేందుకు భక్తులు పోటీ పడ్డారు. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు సంప్రదాయబద్ధంగా నిత్యపూజలు నిర్వహించారు. కొండపై ఉన్న శివాలయంలో శ్రీరామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శివగామరితితో పాటు శ్రీ పర్వతవర్ధిని నిర్వహించారు. మరోవైపు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా భక్తుల రద్దీ నెలకుంది. ఆలయం ముందు భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్వామివారి దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతుండటంతో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈరోజు రేపు గర్భాశయంలో భక్తులచే నిర్వహించే ఆర్జిత సేవలను ఆలయ అధికారులు రద్దు చేశారు.

## ప్రజా విజయోత్సవాలు కాదు.. ప్రజా వంచన ఉత్సవాలు చేసుకోండి

మొదటి పేజీ తరువాయి...

ఇచ్చారని చేసుకుంటారా? దేనికోసం విజయోత్సవాలు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బండి సంజయ్ ప్రశ్నించారు. అవన్నీ ఇచ్చాక ఉత్సవాలు చేసుకోవాలని హితవు పలికారు. ఇప్పుడు మీరు చేసుకోవాల్సింది విజయోత్సవాలు కాదు%ా% నమ్మించి ప్రజలను మోసం చేసిందుకు 'ప్రజా వంచన' ఉత్సవాలు చేసుకోండని ధ్వజమెత్తారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద బీజేపీ నాయకులతో కలిసి కొనుగోలు కేంద్రాలను బండి సంజయ్ సందర్శించారు. వడ్ల కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ పైసలివ్వకుండా తప్పించుకోవడానికి వడ్ల కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. బ్రోకర్ల నుంచి కమీషన్లు దండుకునేందుకు రాష్ట్ర రైతుల ప్రయోజనాలను బలి పెడుతున్నారని ధ్వజమెత్తారు. వడ్ల పైసలన్నీ మిత్తీతో సహా కేంద్రమే చెల్లిస్తోందని.. అయినప్పటికీ వడ్లు కొనివ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన నొప్పి ఏందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు కనీస మద్దతు ధర దక్కలేదని.. బోనస్ రాలేదని బండి సంజయ్ అన్నారు. పైగా తాలు, తరుగు, తేమ పేరుతో నష్టం జరిగిందన్నారు. ఇక మీరు రైతులను ఆదుకున్నదెక్కడ అని ప్రశ్నించారు. ఇదేనా రైతు ప్రభుత్వమంటే%ా% ఇదేనా ఇందిరమ్మ పాలన అని మండిపడ్డారు. రైతులను అరిగోసపెట్టి దోచుకోవడమేనా కాంగ్రెస్ పాలనంటే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 95 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండిస్తే%ా% బహిరంగ మార్కెట్ అవసరాలకు 40 లక్షల వడ్లు పోతే, మిగిలిన 55 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగోలుకు సంబంధించి పైసలన్నీ చెల్లించేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. చివరకు వడ్ల కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం బయట నుంచి అప్పు తీసుకుంటే%ా% ఆ డబ్బులకు వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తోందని.. అయినా ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏం మాయరోగం అని నిలదీశారు. ఎందుకు సకాలంలో వడ్లు కొనకుండా రైతులను అరిగోస పెడుతోందని ప్రశ్నించారు. సకాలంలో వడ్లు కొంటే బోనస్ ఇయ్యాలి. దానికి 2,500 కోట్లు కావాలి. ఇంతా చేస్తే మిగిలేదేమీ ఉండదు. అలా కాకుండా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వడ్లను బ్రోకర్లు కొనేదాకా ఎదురు చూస్తే కోట్లకు కోట్లు కమీషన్లు దండుకోవచ్చు%ా% బోనస్ భారం నుంచి తగ్గించుకోవచ్చు%ా% ఇదీ కాంగ్రెస్ కుట్ర అని బయటపెట్టారు. బోనస్ ఇవ్వకుండా తప్పించుకోవడానికి, కమీషన్లు దండుకోవడానికి రైతుల ప్రయోజనాలను బలి పెడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు వడ్లన్నీ కొనాల్సిందేనని.. బోనస్ చెల్లించాల్సిందేనని డిమాండ్ చేశారు.

# మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

## రాంబాగ్ మైదానంలో సమావేశమైన పారిశుధ్య కార్మికులు

**ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి**

**మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**



బుద్వేల్, నవంబరు 10(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ పరిధిలోని రాంబాగ్ మైదానంలో ఆదివారం రాజేంద్రనగర్ మండల ఏఐటీయూసీ కార్యదర్శి టి ఆనంద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ , ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోమున్సిపల్లో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా కార్మికులందరికీ వేతనాలు అమలు చేయాలి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక కార్మికులకు న్యాయం జరుగుతుందని ఎంతో ఆశతో పర్మినెంట్ చేస్తారని కార్మికులందరూ ఎదురుచూస్తున్నారు. పర్మనెంట్ చేసేంతవరకు కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని అన్నారు కార్మికులు విధులు నిర్వహిస్తూ ప్రమాదశాస్త్రం మరణిస్తే కార్మికుల కుటుంబానికి 25 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలన్నారు కార్మికులందరికీ పండుగ జాతీయ సెలవులు అమలు చేయాలి అన్నారు. ఒకే సంస్థలో ఒకే పని చేస్తున్న పర్మనెంట్ కార్మికుడికి ఇచ్చే జీతం కాంట్రాక్టు కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్యం పనులు చేస్తున్నటువంటి కార్మికులని చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన చెందారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధిలు, అధికారులు వస్తున్నారంటే ముందుగా మున్సిపల్ కార్మికుల చేత అని పనులు చేయిస్తారన్నారు. అలాంటి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం మరి దారుణం అన్నారు. కార్మికులు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చు 30 వేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించడం జరిగింది. అత్తాపూర్ డివిజన్ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జైపాల్ రెడ్డి 27 మందితో కౌన్సిల్ సభ్యులను ప్రతిపాదించడం జరిగింది. కార్మికులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు: శ్రీను, కార్యనిర్వాక అధ్యక్షులు: శ్రావణ్, ఉపాధ్యక్షులు: ఎస్ భారతమ్మ ,వెంకటేష్,అనిల్ ప్రధాన కార్యదర్శి: మహేందర్ కుమార్, సహాయ కార్యదర్శిలు: అనిత, ఊర్మిళ, దుర్గాబాయి , కోశాధికారి:అబ్రహం, కౌన్సిల్ సభ్యులు: డి.వెంకటమ్మ, యాదయ్య, నర్సమ్మ, జయంతు, రమల, సుజాత, పద్మ, కె.లక్ష్మి, దుర్గాబాయి, డొక్కలమ్మ, లక్ష్మి, శోభ, మరో 5 మందిని కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకోవడం ఎన్నుకోవడం జరిగింది.



రిజిస్ట్రార్ డి శివాజీ

## వ్యవసాయ, ఉద్యాన కోర్సులలో ఏర్పడిన రెగ్యులర్ కోట సీట్ల ఖాళీల భర్తీ కోసం ఈనెల 18 నుంచి మూడవ దశ కౌన్సెలింగ్

బుద్వేల్, నవంబరు 10(ప్రభాత ఉదయం): వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 18 వ తేదీ నుంచి మూడవ విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. వ్యవసాయ, అనుబంధ కోర్సుల్లో సుమారు 213 ఖాళీలు ఏర్పడినట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డి. శివాజీ తెలిపారు. ఈ కోర్సుల్లో ఏర్పడిన ఖాళీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్ - 80, బీవీఎస్సీ - 08, బీఎస్సీ (హానర్స్) హార్టికల్చర్ - 70 బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ - 40, బిటెక్ ఫుడ్ టెక్నాలజీ - 15. ఈనెల 18 నుంచి జరిగే మూడవ దశ కౌన్సిలింగ్ ద్వారా ఈ కోర్సులలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. మూడవ దశ కౌన్సిలింగ్ షెడ్యూలు, వివిధ కోర్సుల్లో ఏర్పడిన ఖాళీలు తదితర వివరాలు విశ్వవిద్యాలయ వెబ్సైట్ www.pjtau.edu.inలో పొందవచ్చు అని ఆయన వివరించారు. మెరిట్ ఆధారంగానే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విశ్వవిద్యాలయంలోని డిగ్రీ కోర్సులలో ఏర్పడిన రెగ్యులర్ కోట ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం లోని డిగ్రీ కోర్సుల ప్రవేశాల్లో ఎలాంటి మధ్య దళారుల ప్రమేయం ఉండదని వారి మాయ మాటలు నమ్మి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మోసపోవద్దని ఆయన సూచించారు.



## నేడు మైలార్ దేవుపల్లి, షాపూర్, ఇబ్రహీంభాగ్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజేంద్రనగర్/శంషాబాద్/గండిపేట, నవంబర్ 10(ప్రభాత ఉదయం) మైలార్ దేవ్ పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల మైలార్ దేవుపల్లి,బృందావన్ కాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం టాటానగర్ బృందావన్ కాలనీ ప్రగతి కాలనీ మోడల్స్ కాలనీ మైలార్ దేవుపల్లి గ్రామం రామకృష్ణ హిల్స్ ప్రాంతాలలో సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

**మణికొండ లో...**

ఇబ్రహీం భాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని మణికొండ విద్యుత్ సబ్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించటానికి ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శివాజీ నగర్, సెక్రటేరియట్ కాలనీ, సుందర్ గార్డెన్, గోల్డెన్ టెంపుల్, పైపులైన్ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ కే సంతోష్ కుమార్ తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**షాపూర్ సెక్షన్ లో...**

శంషాబాద్ మండలంలోని షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని మల్కారం విద్యుత్ సబ్టేషన్ పరిధిలో వివిధ మరమత్ లర్ నిమిత్తం సోమవారం సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు.

**సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3.గంటల వరకు**

మల్కారం విద్యుత్ సబ్టేషన్ పరిధిలోని మల్కారం ,నానాజీపూర్ ,రాయన్నగూడ ,కవెలిగూడ ,రామాంజపురం. బోటిగూడ గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సూచించారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



శ్రీ వెంకటేశ్వర స్వామి ముఖద్వారం వద్ద ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కౌన్సిలర్లు

## కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, నవంబర్ 10(ప్రభాత ఉదయం) కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆదివారం విఐపి విరామ సమయంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ దర్శించుకున్నారు. మణికొండ మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి స్వామిని దర్శించుకుని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మొక్కలు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తోపాటు, మణికొండ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, కావ్య శ్రీ రామ్, శైలజ తదితర కౌన్సిలర్లు ఉన్నారు

## దేశంలోని విలువైన వనరులన్నీ వారికోసమే

**భట్టి షాకింగ్ కామెంట్లు**



మహారాష్ట్ర, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): దేశంలోని వనరులు, సంపద అంతా ప్రజలకు దక్కాలి కానీ.. కొంత మంది పెట్టుబడిదారులకు కాదని, అలాంటి ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు తెలంగాణ ఉ పముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడు, స్టార్ క్యాంపెయినర్ గా జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్న భట్టి విక్రమార్క.. అక్కడి కార్యకర్తలతో బూతు స్థాయి మీటింగుల్లోనూ, బహిరంగ సభల్లోనూ పాల్గొంటూ అక్కడి కూడమిని గెలిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదివారం నాడు జారండ్ లోని రాంఘర్ నియోజకవర్గ పార్టీ బూత్ స్థాయి సమావేశంలో, చిత్తార్పూర్ సీ, డీ బ్లాక్, రాజరప్ప బహిరంగ సభలో పాల్గొన్న భట్టి విక్రమార్క.. నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అదానీ, అంబానీ వంటి కొద్దిమంది క్రోనో క్యాపిటలిస్ట్ నుంచి జార్ఖండ్ కు విముక్తి కల్పించాలని, ఇండియా కూటమి అభ్యర్థుల్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేశారన్న భట్టి విక్రమార్క.. విద్వేషాలను రగిలించే వారి చేతిలో దేశాన్ని పెట్టవద్దని, ప్రేమ ద్వారా అన్ని జాతులు, మతాలకు సమాన అవకాశాలు ఇస్తామనే సందేశాన్ని ఇచ్చారని అన్నారు. బీజేపీ పార్టీ దేశంలోని సంపదల్ని, ప్రభుత్వ రంగ సంస్థల్ని అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారంటూ మండిపడ్డ భట్టి విక్రమార్క.. అలాంటి వారి నుంచి దేశాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు.



హత్య కు గురైన సైఫ్ అలియాస్ సాబేర్




సైఫ్

## అప్పు తీర్చమన్నందుకు స్వంత బామర్దిని హత్య చేశాడు

బుద్వేల్, నవంబరు10(ప్రభాత ఉదయం) అవసరానికి అప్పుగా ఇచ్చిన సొమ్మును తిరిగి చెల్లించమని అడగినందుకు బామర్దిని హత్య చేశాడు ఓ బావ. ఈ విషాదకర సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి వట్టెపల్లి షమాకాలనీలో ఆదివారం తెల్లారుజామున జరిగింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. శమాకాలని కి చెందిన సైఫ్ అలియాస్ సాభేర్ (38) టీవీ మెకానిక్ పని చేస్థాడు . గౌస్ నగర్ ఉండే బావ ఇస్మాయిల్ ఆటో డ్రైవర్. ఏడు నెలల క్రితం సైఫ్ బావ ఇస్మాయిల్ కు రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చాడు.గత కొంత కాలంగా అప్పు కట్టడం లేదు. అప్పు తిరిగి ఇవ్వమని గత కొన్ని రోజులుగా సైఫ్ బావను ఒత్తిడి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇద్దరు మద్యం సేవించారు. తను ను డబ్బులు అడుగుతున్నాడని కోపంతో కక్ష పెంచుకున్న ఇస్మాయిల్ సైఫ్‌ను ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తలపై బండ రాయితో మోది అతి దారుణంగా హత్య చేశాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య చేసిన నిందితుడు ఇస్మాయిల్ ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు మైల ర్ దేవ్ పల్లి పోలీసులు తెలిపారు.



పల్లవి అలియాస్ వీరమణి

## నీళ్ల సంపులో పడి మహిళ మృతి

బుద్వేల్, నవంబరు 10(ప్రభాత ఉదయం) : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ నీళ్ల సంపులో పడి మరణించింది. ఈ సంఘటన ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి హ్యాపీ హోమ్స్ టవర్-6లో జరిగింది. దశరథ్, పల్లవి అలియాస్ వీరమణి భార్యాభర్తలు. టవర్-6 లో వీరు వాచ్మెన్ గా పనిచేస్తారు. అలాగే ఇండ్లలో పనులు కూడా చేస్తుంటారు. దశరథ్ పనిమీద స్వగ్రామానికి వెళ్ళాడు. ఆదివారం వీర మణి నీళ్ల సంపులో పడి మరణించింది. ఆమె మరణాని కి కారణాలు తెలియ రాలేదు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సుప్రీంకోర్టు సీజేఐగా సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణం చేస్తారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ప్రస్తుత చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవీ కాలం ఆదివారంతో ముగుస్తున్నది. ఆయన స్థానంలో సుప్రీంకోర్టు సీజేఐగా ఎంపికైన జస్టిస్ సంజీవ్ ఖన్నా 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్నారు. 2025 మే రెండో వారం వరకూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా వ్యవహరిస్తారు. ఖన్నా కుటుంబ సభ్యుల నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన సంజీవ్ ఖన్నా మూడో వ్యక్తి. అంతకు ముందు ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పని చేసిన దేవీరాజ్ ఖన్నా కొడుకే సంజీవ్ ఖన్నా. సుప్రీంకోర్టు జస్టిస్ హెచ్ఆర్ ఖన్నాకు సమీప బంధువు. జస్టిస్ సంజీవ్ ఖన్నా పలు చారిత్రక తీర్పులు ఇచ్చిన వారిలో ఒకరు. ఈవీఎంల పవిత్రతతోపాటు ఎన్నికల బాండ్ల రద్దు, 370 ఆర్టికల్ రద్దు, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ వంటి కేసుల్లో తీర్పులు ఇచ్చారు. 1960 మే 14న జన్మించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించారు. నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ) ఎగ్జిక్యూటివ్ చైర్మన్ గా పని చేశారు. 1983లలో న్యాయవాదిగా ఢిల్లీ బార్ కౌన్సిల్ లో పేరు రిజిస్టర్ చేసుకున్నారు. తొలుత తీస్ హజారీ కాంప్లెక్సులోని జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. సుదీర్ఘకాలం ఆదాయం పన్ను విభాగం సీనియర్ స్టాండింగ్ కౌన్సిల్ గా కొనసాగిన సంజీవ్ ఖన్నా.. 2004లో ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ స్టాండింగ్ కౌన్సిల్ (సివిల్)గా నియమితులయ్యారు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన సంజీవ్ ఖన్నా.. తదుపరి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమోషన్ పొందారు.



ప్రభాత ఉదయం

## కార్తీకమాసంలో లోకకళ్యాణార్థం

# కోటిలింగాల ప్రతిష్ట పూజలు

### వైభవంగా కొనసాగుతున్న మహాసంకల్ప కోటిలింగాల ప్రతిష్ట కార్యక్రమాలు



కొత్తకోట, నవంబర్ 10(ప్రభాత ఉదయం) మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో కార్తీకమాసం పురస్కరించుకొని ఆదివారం తొమ్మిదవరోజు కోటిలింగాల ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. భక్తులు తమస్వహస్తాలతో పదకొండువేలశివలింగాలు ప్రతిష్టించే అపూర్వ కార్యక్రమం దేవస్థానము వారిచే ఏర్పాటు చేయగా ఆదోని వీర శైవ అగమ పాఠశాల అధ్యాపకులు, అర్చకులు జగదీశ్వర స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో జరుపగా భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో కోటిలింగాల ప్రతిష్టలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి, అనిల్ స్వామి,ఆలయ ధర్మకర్త రుమాళ్ళ మహేశ్వర్ భక్తులచే మొదట భక్తులచే రుద్రహెూమం చేయించి పూర్ణాహుతి సమర్పించి కూష్మాండ బలి మహామంగళహారతి సమర్పించి అనంతరం పదకొండు వేల శివలింగాలు కలిగిన శివకోటి యంత్రాలకు రుద్రపఠనంతో భక్తిశ్రద్ధలతో అభిషేకం చేయించి భక్తుల స్వహస్తాలతో పదకొండు వేల శివలింగాలు ప్రతిష్ట చేయించారు. అనంతరం ప్రతిష్టలో పాల్గొన్న భక్తులందరికి ఆలయకమిటి వారు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి రుమాళ్ళ శేఖర్, కమిటీ సభ్యులు విశ్వనాథ్ , జగదీశ్వర్,రాజేష్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం

## 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


గద్వాల, నవంబర్ 10(ప్రభాత ఉదయం) అక్రమంగా తరలిస్తున్న 35క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో మైలగడ్డ స్టేజ్ వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. కేటిదొడ్డి ఎస్ఐ బి.శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉ న్నాయి. ఆదివారం తెల్లవారుజామున కేటిదొడ్డి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానం వచ్చి టిఎస్ యుడి 9171నంబర్ గల బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాహనంలో సుమారు 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. బాలస్వామి, లక్ష్మీనారాయణ, రమేష్, బాలస్వామిల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. రేషన్ కార్డు లబ్దిదారుల నుంచి ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా రాయచూరుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.



గద్వాల మండలం కురువపల్లిలో ఇంటింటి సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

## ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకొండ వివరాలు పొందుపరచాలి: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 10(ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి తప్పులు దొర్లకొండ సర్వేను విజయవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం గద్వాల మండలంలోని కుర్వపల్లి గ్రామంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే తీరును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమగ్ర కుటుంబ సర్వే ఫారంలోని ప్రతి ప్రశ్నకు తప్పనిసరిగా సమాధానం ఉండాలని, పూర్తి అవగాహన చేసుకుని ఫారం నింపాలని అధికారులకు సూచించారు. సమగ్ర ఇంటింటి సర్వేలో ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని అన్నారు. సర్వే నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని, ప్రజల నుండి వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యుమరేటర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సర్వే కొరకు 56 అంశాలు ఉన్నాయని ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారం సేకరణతో నమోదులు చేయాలన్నారు. విధులలో అధికారులు ఎలాంటి అలసత్వం వహించకుండా సర్వేని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎంపీడీవో ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవ సోదరులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## చర్చిల అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్

మల్కాజిగిరి, నవంబర్ 10(ప్రభాస్ ఉదయం) చర్చిల అభివృద్ధికి కృషి చేస్తా నని మల్కాజిగిరి శాసనసభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గం పరిధిలోనిగౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని హిల్ చర్చిలో జరిగిన హార్వెస్ట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...చర్చిల అభివృద్ధి తన సంపూర్ణ సహకార అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ దేవుని యందు భక్తితో మెలగాలని కోరారు. తన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరుంధతి ఆసుపత్రి సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ సమస్య వచ్చిన తనను సంప్రదించాలని తాను నిత్యం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, పాస్టర్ బక్క ఏలియా యేసు రత్నం ప్రదీప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొత్తకోట, నవంబర్ 10(ప్రభాత ఉదయం) గుర్తుతెలియని వివాహనం ఢీకొని గుర్తుతెలియని మగ వ్యక్తి చనిపోయిన సంఘటన శనివారం రాత్రి నేషనల్ హైవే 44 పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కొత్తకోట మండలం కని మేట గ్రామ0లో ఫుడ్ పిరమిడ్ హెూటల్ సమీపంలో ని నేషనల్ హైవే పై కర్నూల్ నుండి హైదరాబాద్ కు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మగ వ్యక్తి మరణించడం జరిగిందని, అతని వయసు 45 నుండి 50 సంవత్సరాల వయస్సు ఉండవచ్చునని, చనిపోయిన వ్యక్తికి చెవి దగ్గర ఒక పులిపిరి, ఇట్టి మనిషి కి నీలిరంగు లైన్లో కల ఫుల్ షర్టు, మరియు తెల్లది అడ్డ పంచ, గ్రీన్ కలర్ డ్రా యర్ ఒక బ్లూ కలర్ సంచి దానికి , మొలతాడుకు తాళం చెవి, చెక్స్ గల టవలు ఉ న్నాయని తెలిపారు. చనిపోయిన వ్యక్తిని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించామని ఎవరైనా ఇట్టి వ్యక్తిని గుర్తించిన చో కొత్తకోట పోలీస్ స్టేషన్కు వచ్చి సంప్రదించ వలసిందిగా ఎస్సై మంజునాథ రెడ్డి తెలిపారు.



పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేసిన బిజెపి నాయకులు

## ఆలయం మీద దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

### శంషాబాద్ పోలీస్ స్టేషన్ ముందు బయట ఇచ్చిన హిందూ సంఘాలు

శంషాబాద్, నవంబర్ 10( ప్రభాత ఉదయం) మండలంలోని జూకల్ గ్రామంలోని అమ్మవారి దేవాలయం పై దాడి చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల నాయకులు శంషాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. శంషాబాద్ మండల బిజెపి అధ్యక్షుడు చిటికెల వెంకటయ్య. యువమోర్చా అధ్యక్షుడు బుక్క ప్రవీణ్ కుమార్. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు వివేకానంద గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజులుగా శంషాబాద్లో హిందూ దేవాలయాలపై వరుసగా దాడులు నిర్వహిస్తున్న పోలీసులు స్పందించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గుడి పై దాడి జరిగినా అది పిచ్చివాడు. మతిస్థిమితం లేని వాళ్ళు చేశారని పోలీసులు ప్రకటించడానికి తీవ్రంగా ఖండించారు. జూకల్ గ్రామంలో అమ్మవారి దేవాలయం పై దాడి చేసిన నిందితుడిని గ్రామస్తులు పట్టించారని ఆ నిందితుడితో పాటు మరో 9 మంది ఉన్నట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు వెంటనే నిందితులను అదుపులోకి తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టు తీట్టమైన చర్యలు తీసుకోవాలని చిటికెల వెంకటయ్య. బుక్క ప్రవీణ్ కుమార్. వివేకానంద గుప్త డిమాండ్ చేశారు . పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తే తాము ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో రాళ్ల బండి ప్రసాద్ గౌడ్. చౌదరిగుడా మహేష్. పెద్ద షాపూర్ బాలు. బాల్ రెడ్డి.తదితరులు పాల్గొన్నారు.



బుగ్గిపాలైన సీడ్ పత్తి

## వెంకటాపురం గ్రామంలో సీడ్ పత్తి దగ్ధం

కేటిదొడ్డి, నవంబర్ 10(ప్రభాత ఉదయం) ప్రమాదవశాత్తు సీడ్ పత్తికి నిప్పు అంటుకోవడంతో పత్తి దగ్ధమైన ఘటన ఆదివారం కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాపురం రంగస్వామి తన వ్యవసాయ పొలంలో సీడ్ పత్తి సాగు చేశాడు. సాగు చేసిన పత్తిని ఇంట్లో ఉంచగా ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో క్వింటా సీడ్ పత్తి కాలిపోయింది. దీంతో రైతుకు రూ.లక్ష మేర ఆస్తినష్టం వాటిలింది. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

## కులగణనను స్వాగతిస్తున్నాం

### కేటీఆర్ నోట పాజిటివ్ కామెంట్స్!

హైదరాబాద్, నవంబర్ 10 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కులగణనను స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణను స్వాగతిస్తున్నామని పాజిటివ్ గా మాట్లాడుతూనే రాజకీయ, ఆర్థిక నేపథ్యంపై ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించారు. కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్ ప్రకటించి ఏడాది పూర్తైందని, బలహీన వర్గాలకు, ఆడబిడ్డలకు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ హామీలు ఇచ్చి మోసం చేసిందని తెలిపారు. కొత్త హామీలు దేవుడెరుగు కానీ ఉన్నవాటిని కూడా రద్దు చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ద్రోహం చేసిందని, వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచిందని వ్యాఖ్యానించారు. చేతి గుర్తుకు ఓటేస్తే, చేతివృత్తులవారి గొంతు కోసిందని మండిపడ్డారు. ఇప్పుడు బీసీల ఓట్ల కోసం కులగణన పేరుతో నాటకం ఆడుతోందని ఆరోపించారు. సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు అడుగుతున్నారని అన్నారు.

## కొత్తకోట యం.బి చర్చిలో కృతజ్ఞతార్పణల పండుగ





కొత్తకోట, నవంబర్ 10(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని యం.బి సీయోను చర్చి లో కృతజ్ఞతార్పణల (కోతకాలపు పండుగ) ను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కోతకాలపు పండుగ సందర్భంగా రెవ,, సైలెస్ రెజినల్డ్, డెస్టినేషన్ చర్చి పాస్టర్ హైదరాబాద్ వారు వాక్యోపదేశాన్ని అందించుటకు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృతజ్ఞ తార్పణల పండుగ అంటే ఆయనను స్తుతించుడి, ఆయన నామమును ఘనపరచుడి, నీ,నా, పాపములు, కడగబడినందుకు ఏసుక్రీస్తుకు కృతజ్ఞ తార్పణలు చెల్లించాలి అని బైబిల్‌లోని ప్రవచనాలను క్రైస్తవులకు బోధించారు.పండుగ సందర్భంగా యం బి చర్చ్ పెద్దలు, మహిళలు, యువకులు చిన్నారులతో చర్చి కిక్కిరిసిపోయింది పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కీర్తనలు పాడుతూ ఏసుక్రీస్తును ఆరాధించారు. ఈ కార్యక్రమంలో సంఘ పాస్టర్ పి.ఆర్.మెన్నో సైమన్, సంఘ చైర్మన్ కే.కృపయ్య, సెక్రెటరీ బి.నిక్సన్, కోశాధికారి శ్యామ్, జయరాజ్, జె.రమేష్, ప్రియదర్శనం, జెసి.రత్నం, శ్రీనివాసులు, జాన్, జె.రాజు, ఎన్.ఆరోను, జె.రత్నం, కృష్ణయ్య, ఎస్.బాబు, ఎస్.యోహన్, యాకోబు,కృష్ణయ్య, జె.శ్రీను, ఏలియా, ఎస్. రాజశేఖర్, ఎన్.చంద్రశేఖర్ ఎన్.అయ్యన్న,ఎం. భాస్కర్, ఏ.దేవరాజ్, కే.సుజ్ఞానం, జె కే రాజు, ప్రవీణ్ కుమార్,కర్ణ కుమార్, మోహన్,తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.